
అల్లూరి విప్లవ జ్యోతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి


అల్లూరి సీతారామరాజు విగ్రహానికి నివాళులర్పిస్తున్న వీవీ వర్మ

కుత్బుల్లాపూర్: అల్లూరి సీతారామ రాజు 127వ జయంతిని పురస్కరించుకుని పలు ప్రాంతాల్లో వేడుకలు నిర్వహించారు. కొంపల్లి మున్సిపల్ పరిధి ఎన్‌సీఎల్ నార్త్‌లో పొత్తూరి శివాజీరాజు అధ్యక్షతన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అల్లూరి కుల, మత, ప్రాంతాలతో సంబంధం లేకుండా గిరిజనుల హక్కులు, దేశ స్వాతంత్రం కోసం కేవలం 27 సంవత్సరాలకే దేశం కోసం తన ప్రాణాలు అర్పించారని అన్నారు. ఆయన పోరాట స్ఫూర్తిని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఆజాది కా అమృత్ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా 2022లో ప్రధాని మోదీ భీమవరంలో అల్లూరి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించి 125వ జయంతి సంబరాలు ప్రారంభించారన్నారు. ఈ కార్యక్రమంలో ఉదయ్, కుమార్,వరాహల రాజు, వెంకన్న బాబు, హరి,వెంకట రాజు, భాను, అల్లూరి సీతారామారాజు అభిమానులు పాల్గొన్నారు.

ప్రగతినగర్‌లో...

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతినగర్‌లో గురువారం అల్లూరి సీతారామరాజు విగ్రహానికి వీవీ వర్మ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎంఆర్ ఎస్ రాజు, వేణుగోపాల్ రాజు, కృష్ణం రాజు, సాయిరాజు, రామకృష్ణారాజు తదితరులు పాల్గొన్నారు.


కొంపల్లిలో నిర్వహించిన అల్లూరి సీతారామరాజు జయంతి ఉత్సవాలు

ఫాక్స్‌సాగర్ కబ్జా ఫికర్!

ఒకప్పుడు మంచినీటి చెరువు.. తర్వాత కాలుష్య కాసారం.. ఇప్పుడు కబ్జాతో కనుమరుగయ్యే అవకాశం.!

జీడిమెట్ల: ఫాక్స్‌సాగర్ పేరు చెబితేనే ఒకప్పుడు స్వచ్ఛమైన తాగునీరు, పచ్చటి వాతావరణం, పక్షుల కిలకిలలు ఉండేవి. అలాంటి ఫాక్స్‌సాగర్ ఇప్పుడు కాలుష్య కాసారంగా మారింది. ఇంకో నాళ్లయితే చెరువు కనుమరుగయ్యే అవకాశం ఉంది. ఎందుకంటే చెరువు స్థలం కబ్జాకు గురి అవుతోంది. పట్టించుకోవాల్సిన అధికారులే దగ్గరుండి కబ్జాలను ప్రోత్సహిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు వారి పూర్తి సహకారం కబ్జాదారులకు అందిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి పేరుతో చెరువు కబ్జా..

2019లో ఫాక్స్‌సాగర్ అభివృద్ధి పేరిట ప్రభుత్వం రూ.44కోట్లు విడుదల చేసినట్లు అప్పట్లో వార్తలొచ్చాయి. ఇక చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్‌కోసం అంటూ అధికారులు హడావుడిగా మట్టిరోడ్డును వేశారు. అక్కడే పెద్ద ట్విస్ట్ ఉంది. అధికారులు చెరువు స్థలాన్ని వదిలేసి రోడ్డు వేశారు. దీంతో కబ్జాదారులకు కలిసివచ్చింది. వెంటనే వారు అనుకున్న విధంగా రోడ్డుకు అవతలివైపు చకాచకా నిర్మాణాలు చేపట్టి బఫర్ జోన్‌లు నిర్మాణాలు చేపట్టారు. ఈ విషయమై వార్తా పత్రికల్లో వార్తలు రావడంతో కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారులు కొంతమేర కూల్చివేతలు చేసి చేతులు దులుపుకున్నారు.

చెరువులోనే పరిశ్రమ పనులు..
కళ్లు మూసుకున్న అధికారులు..

ఓ పరిశ్రమ యజమాని ఏకంగా తన పరిశ్రమను చెరువు స్థలంలోనే నడిపిస్తున్నాడు. చెరువు స్థలం పక్కన అధికారులకు లంచాలు ఇచ్చి ఒక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించుకున్నాడు. అక్కడ నుంచి చెరువు స్థలంలోకి కరెంట్ సప్లై తీసుకుని చెరువు స్థలంలో పెద్ద ఎత్తున వెల్డింగ్, ఏయిర్ బ్లాస్టింగ్ పనులు నిర్వహిస్తున్నాడు. ఎనిదేళ్లుగా చెరువు స్థలంలో పరిశ్రమ కొనసాగుతుందంటే అధికారుల సహకారం ఏ మేరకు ఉందో అర్థం చేసుకోవచ్చు. చెరువును రక్షించాల్సిన అధికారులే పరోక్షంగా హరిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికై నా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోతే ముఖ్యమంత్రి వరకు ఈ విషయాన్ని తీసుకువెళ్తామని స్థానికులు హెచ్చరిస్తున్నారు.


ఫాక్స్‌సాగర్‌లో కొనసాగుతున్న వెల్డింగ్, ఏయిర్ బ్లాస్టింగ్ పనులు

సీఎం దృష్టికి తీసుకెళ్తాం..



ఫాక్స్‌సాగర్ స్థలాన్ని ఇప్పటికే చాలా మంది కబ్జా చేసి బఫర్ జోన్‌లో నిర్మాణాలు చేపట్టారు. మరికొంత మంది ప్రస్తుతం షెడ్ల నిర్మాణాలు చేస్తున్నారు. చెరువుకు సంబంధించిన వివరాలు తెలపాలని ఇప్పటికే అధికారులను కోరాం. ఇప్పటికైనా అధికారులు ఫాక్స్‌సాగర్ కబ్జాల విషయంలో చర్యలు తీసుకోవాలి. లేకుంటే అధికారులపై పనితీరుపై ఒక ఫైల్ తయారు చేసి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తాం. – వీరేష్‌గుప్తా, సుభాష్‌నగర్

గాజులరామారంలోని సర్వేనం.28లో ట్రైనీ ఐఏఎస్‌ల పర్యటన


గాజులరామారం సర్వే నం.28లో పర్యటిస్తున్న ట్రైనీ ఐఏఎస్‌లు

సుభాష్‌నగర్: శిక్షణలో భాగంగా ఐదు మంది ట్రైనీ ఐఏఎస్‌లు గాజులరామారంలోని సర్వేనం.28లో పర్యటించారు. గాజుల రామారం, సూరారం మధ్య ఉన్న సర్వే నం.28, ఫారెస్ట్ సరిహద్దుల విషయమై స్థానిక తహసీల్దార్ అబ్దుల్ రెహమాన్ ఖాన్ ఆధ్వర్యంలో సర్వేయర్లు, డీటీ, ఆర్ఐ సిబ్బంది చూపించారు. రెవెన్యూలోని పలు మెలుకువలను తెలియజేశారు.

'గురుకుల టైమ్ టేబుల్ యాంత్రిక జీవితానికి నిదర్శనం'

ఉస్మానియా యూనివర్సిటీ: గురుకులాల్లో విద్యార్థుల టైమ్ టేబుల్ యాంత్రిక జీవితానికి నిదర్శమని తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ (టీజీ-ఎస్‌పీ) రాష్ట్ర అధ్యక్షులు బారి అశోక్ కుమార్ యాదవ్ ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉదయం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు చిన్న వయస్సు గల విద్యార్థులు నిరంతరం పని చేయడం కష్టతరమన్నారు. చదువులతో పాటు ఆరోగ్యం, పౌష్టికాహారం, విశ్రాంతి, నిద్ర, క్రీడలు కూడా ముఖ్యమన్నారు. గురుకుల టైమ్ టేబుల్‌ను బలవంతంగా రుద్దకుండా సవరించాలని కోరారు.

టీజీ-పీఎస్సీ ముట్టడికి మద్దతు

ఉస్మానియా యూనివర్సిటీ: నేడు (5న) టీజీ-పీఎస్సీ ముట్టడికి తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ (టీఎస్‌పీ) మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు బారి అశోక్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. నిరుద్యోగుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. గ్రూప్-2, 3 పోస్టుల సంఖ్య పెంపు, డీఎస్సీని వాయిదా, 25000 పోస్టులతో మెగా డీఎస్సీని, రూ.4000 నిరుద్యోగ భృతి, 46 జీవో రద్దు, ఉద్యోగాలకు జాబ్ కేలండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

సాక్షి, మేడ్చల్ జిల్లా: చదువుకుంటూ ఆటపాటలతో సాగాల్సిన పిల్లల బాల్యాన్ని చిదిమేస్తున్న బాలకార్మిక వ్యవస్థను సమూలంగా నిర్మూలించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మేడ్చల్ జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. ఆపరేషన్ ముస్కాన్ - పది సమన్వయ సమావేశం గురువారం మేడ్చల్ జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించారు. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి పిల్లల భద్రత వారి భరోసా పై వివిధ శాఖల అధికారులు హాజరు కాగా, ముఖ్య అతిథిగా జిల్లా సంక్షేమాధికారి కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. పిల్లలు బాల కార్మికులు ఎక్కడ పని చేసినా, వెట్టిచాకిరి, అక్రమ రవాణా, భిక్షాటన చేస్తున్న పిల్లలను గుర్తించి, వెంటనే 1098 కి తెలియజేయాలన్నారు. ఆపరేషన్ ముస్కాన్ పది లో భాగంగా అక్రమ రవాణాలో చిక్కుకున్న పిల్లలను రక్షించి పునరావాసం కల్పిస్తారన్నారు.. వివిధ కారణాల వల్ల వారి కుటుంబాల నుండి విడిపోయిన లేదా తప్పిపోయిన పిల్లలను గుర్తించడానికి 'దర్పణ్' అనే ఫేషియల్ రికగ్నిషన్ సాఫ్ట్‌వేర్ అప్లికేషన్‌ను ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ రాజారెడ్డి,సభ్యులు అర్చన, నాగ జయశ్రీ, రామ్మోహన్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి టి రఘునాథ స్వామి పాల్గొన్నారు.

పిల్లల మెదడు, వెన్ను చికిత్సలకు కొత్త సాంకేతికత

లక్డీకాపూల్: పీడియాట్రిక్ న్యూరోసర్జరీకి సంబంధించిన మెదడు, వెన్నెముక వ్యాధులకు సరికొత్త సాంకేతికతో కూడిన శస్త్ర చికిత్సలు అవసరమని పలువురు న్యూరోసర్జన్‌లు అభిప్రాయపడ్డారు. ఇందుకు న్యూరో సర్జన్లు, నర్సులకు మెరుగైన నైపుణ్యాన్ని మరింత పొందించాల్సి ఉందన్నారు. గురువారం నిమ్స్‌లో బ్రెయిన్ అండ్ స్పైన్ సొసైటీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగే అవగాహన సదస్సును సొసైటీ కో చైర్మన్ ఆర్థర్ డా. కున్హా ప్రారంభించారు. నిమ్స్ డైరెక్టర్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, పీడియాట్రిక్ న్యూరో సర్జరీ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ వివి సింగ్, సొసైటీ అధ్యక్షుడిగా ఎన్నికైన ప్రొఫెసర్ మానస్ పాణిగ్రాహి, నిమ్స్ న్యూరో సర్జరీ విభాగాధిపతి డాక్టర్ సుచంద భట్టాచార్జీ తదితరలు పాల్గొన్నారు. ఈ నెల 6వ తేదీ వరకు జరిగే ఈ సీఎంఈ ప్రోగ్రామ్‌లో ఆచరణాత్మక అనుభవాన్ని అందించడానికి హ్యాండ్స్ ఆన్ వర్క్‌షాప్, నర్సులకు శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. చాలా మంది పిల్లలు మెదడులోని హైడ్రోసెఫాలస్ అని పిలువబడే అధిక నీరు, మెదడు కణితులు, వెన్ను వంటి నాడీ సంబంధిత వ్యాధులతో పుడతారన్నారని దాంతో చర్మంపై పొలుచు ఏర్పడుతుందన్నారు. దీనిని సాధారణంగా మైలోమెనింగోకోలె అని పిలుస్తారని వారు స్పష్టం చేశారు. వారిలో చాలా మందికి అవ్వవసర శస్త్ర చికిత్స చేయాల్సి వస్తుందని ఈ సందర్భంగా పలువురు న్యూరో సర్జన్‌లు పేర్కొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పేరుతో మోసం

వెంగళరావునగర్: సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తానని మహిళ వద్ద నుంచి రూ. 4 లక్షలు తీసుకున్న వ్యక్తిపై మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు. పోలీసుల సమాచారం మేరకు... విజయవాడకు చెందిన నాగశ్వేత భర్తతో కలిసి వెస్ట్ శ్రీనివాస్‌నగర్‌లో నివాసం ఉంటుంది. ఉద్యోగం కోసం ప్రయత్నిస్తుండగా ఆమె కజిన్ అఖిల్ ద్వారా ఏపీలోని పొన్నూరు ప్రాంతానికి చెందిన హరీష్ కొండబాబు పరిచయం అయ్యాడు. అతను సాఫ్ట్‌వేర్ ఉద్యోగం కావాలంటే రూ. 4 లక్షలు చెల్లించాలని ఆమెకు తెలిపాడు. ఆ మాటలు నమ్మిన ఆమె జులై 10న రూ. 4 లక్షలు ముట్టజెప్పింది. హరీష్ ఆమెకు ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఏడాదికి రూ. 4.45 లక్షలు జీతం ఇస్తున్నట్టుగా చెప్పి ఉద్యోగం ఇప్పించాడు. సదరు కంపెనీలో నాలుగు నెలలు ఉద్యోగం చేసినా సంస్థ నుంచి ఆమెకు ఎలాంటి ఐడీకార్డు, ల్యాప్‌టాప్, ఎలాంటి జీతం ఇవ్వలేదు. దాంతో ఆమె ఉద్యోగం మానేసింది. అనంతరం అతనిని తన డబ్బును తిరిగి ఇవ్వాలని కోరింది. దానికి హరీష్ తన భర్తకు తెలియకుండా ఒక్కదానివే కలిస్తే ఇస్తానని వాట్సప్ కాల్‌లో చెప్పాడు. ఆమె దానిని రికార్డు చేయలేకపోయింది. తన భర్తకు తెలియజేయగా అతని ఫోన కాల్స్ ఎత్తకుండా కట్ చేస్తుంది. ఏడాది గడస్తున్న తన వద్ద తీసుకున్న నగదు తిరిగి ఇవ్వకపోగా అసభ్యంగా మాట్లాడటంతో గురువారం బాధితురాలు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తులో ఉంది.

చిరువ్యాపారులకు అండగా ఉంటా


కొలను హన్మంత్‌రెడ్డిని కలిసిన చిరువ్యాపారులు

నిజాంపేట్: చిరు వ్యాపారులకు తాను అండగా ఉంటానని కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలను హన్మంత్‌రెడ్డి అన్నారు. గురువారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని ప్రగతినగర్‌లో చిరువ్యాపారుల దుకాణాలను మున్సిపల్ అధికారులు తొలగించారు. వెంటనే వారు బాచుపల్లిలో కొలను హన్మంత్‌రెడ్డి వద్దకు వెళ్లి తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. ఈ సందర్భంగా హన్మంత్‌రెడ్డి మాట్లాడుతూ... రోడ్డు పక్కన చిరువ్యాపారాలు చేసుకునే మీలాంటి వారికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూస్తానని హామీ ఇచ్చారు.

అల్ట్రాఫాస్ట్ సిమెంట్‌తో వేగవంతంగా నిర్మాణం


తాపీ మేస్త్రీల సమావేశంలో భారతి సిమెంట్ టెక్నికల్ ఇంజినీర్ శివకుమార్

కుత్బుల్లాపూర్: సిమెంట్ వ్యాపారంలో భారతి సిమెంట్స్ తిరుగులేని సంస్థగా ఎదుగుతోందని సంస్థ టెక్నికల్ ఇంజినీర్ శివకుమార్ అన్నారు. గండి మైసమ్మలోని శ్రీనివాస స్టీల్ ట్రేడర్లు డీలర్ షాప్‌లో తాపీ మేస్త్రీలతో గురువారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తమ కంపెనీ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ 5-స్టార్ గ్రేడ్ తెలంగాణలో విడుదల చేసిందన్నారు. భారతి అల్ట్రాఫాస్ట్ సిమెంట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందన్నారు. అల్ట్రాఫాస్ట్‌తో ముఖ్యంగా శ్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారుల నిర్మాణాలకు సరైన ఎంపికని పేర్కొన్నారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచితంగా సాంకేతిక సహాయం కూడా అందజేస్తామని తెలిపారు. శ్లాబ్ వేసే సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజినీర్లు సైట్ వద్దకే వచ్చి సరైన సూచనలు చేస్తారన్నారు. మార్కెట్లో లభించే ఇతర సిమెంట్‌తో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్ రూ.20 అధికంగా ఉంటుందని తెలిపారు. డీలర్ జయంత్‌రెడ్డి మాట్లాడుతూ... భారతి సిమెంట్ సర్వీస్ చాలా ఫాస్ట్‌గా ఉంటుందన్నారు. ఈ సమావేశానికి అసిస్టెంట్ మేనేజర్ మార్కెటింగ్ అయ్యప్పరెడ్డి, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ బ్యాగులను ప్రభుత్వం నిషేధించాలి

కూకట్‌పల్లి: అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ వాడక నిషేధ దినం సందర్భంగా జలవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జేఎన్‌టీయూ రైతుబజార్ వద్ద గురువారం జ్యూట్ బ్యాగుల పంపిణీ జరిగింది. జన విజ్ఞాన వేదిక సభ్యులు ప్లాస్టిక్ బ్యాగుల వాడకం వల్ల పర్యావరణానికి కలిగే నష్టాలను వివరించారు. ప్రభుత్వం ప్లాస్టిక్ బ్యాగులను తక్షణమే నిషేధించాలని కమిటీ అధ్యక్షుడు కోయ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ప్లాస్టిక్ కవర్ల వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందన్నారు. ప్లాస్టిక్ కవర్లు తిని మూగజీవాలు చనిపోతున్నాయని తెలిపారు. సముద్రాలు కలుషితం అవుతున్నాయని సాహితీవేత్త పి.శ్రీనివాస్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ప్లాస్టిక్ కవర్ల స్థానంలో జ్యూట్, క్లాత్ బ్యాగులు వాడేలా చర్యలు తీసుకోవాలన్నారు. జనవిజ్ఞాన వేదిక జానకులు రాజా, లింగస్వామి, కోశాధికారి వరప్రసాద్, ప్లాస్ బ్యాగుల వల్ల జరిగే హానిని పలు ప్రత్యామ్నాయాలను సూచించారు. కూకట్‌పల్లి జోన్ ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణ, అధ్యక్షులు శాంతి ఇషాన్, కమిటీ సభ్యులు శ్రీనివాస రావు, శరత్ చంద్ర, సాయి పాల్గొన్నారు.


కేపీహెచ్‌బీ రైతుబజార్ వద్ద జ్యూట్ బ్యాగులను పంపిణీ చేస్తున్న జన విజ్ఞాన వేదిక సభ్యులు

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు


నిజాంపేట్: బాచుపల్లిలోని హెచ్‌ఎండీఏ రోడ్డు విస్తరణ పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని బాచుపల్లి ఏఈ శాంతకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. క్రాంతినగర్, ఆర్టీసీ కాలనీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఇకపై 'నో రాంగ్ రూట్'


వాహనదారులకు సూచనలు చేస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్

సుభాష్‌నగర్: రాంగ్ రూట్‌లో వాహనాలను నడిపితే కఠిన చర్యలు తప్పవని జీడిమెట్ల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ హెచ్చరించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని షాపూర్‌నగర్‌లో రాంగ్ డ్రైవింగ్‌పై గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో 11 మంది పట్టుబడగా వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. వాహనాలను రాంగ్ రూట్‌లో నడిపితే ప్రమాదాలతో పాటు ట్రాఫిక్ జామ్‌కు కారకులవుతారని అన్నారు.

వంగవీటి మోహనరంగాకు నివాళి


నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

నిజాంపేట్: కాపుల అభివృద్ధి కోసం వంగవీటి మోహనరంగా చేసిన సేవలు మరువలేనివని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. గురువారం వంగవీటి మోహనరంగా జయంతి సందర్భంగా గాజులరామారంలో ఆయన విగ్రహానికి పూలమాలాలు వేసి నివాళులర్పించారు. ఈ కాపు సంఘం నాయకులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీ కమిషనర్ అమ్రపాలి అకస్మిక తనిఖీలు

కూకట్‌పల్లి: నగరంలోని పలు ప్రాంతాల్లో జీహెచ్‌ఎంసీ కమిషనర్ అమ్రపాలి శానిటేషన్‌పై గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కూకట్‌పల్లి జేఎన్‌టీయూ, మూసాపేట, భరత్‌నగర్‌లోని రైతు బజార్ తదితర ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. పారిశుద్ధ్య నిర్వహణ సరిగా ఉందా లేదా అనే విషయాన్ని నేరుగా పరిశీలించారు. వీధుల్లో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చెత్తా చెదారాన్ని తొలగించాలని అధికారులను ఆదేశించారు. పలు ప్రాంతాల్లో మిగిలి ఉన్న జీవీపీలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

దొడ్డి కొమురయ్యకు నివాళి


కొమురయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న కురుమ సంఘం నాయకులు

జగద్గిరిగుట్ట: దొడ్డి కొమురయ్య వర్ధంతిని గురువారం జగద్గిరిగుట్ట డివిజన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ కురుమ సంఘం అధ్యక్షుడు పాలకృష్ణ, సెక్రటరీ కుంటి మల్లేష్, ప్రతాప్, దుర్గయ్య హాజరై కొమురయ్య విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తెలంగాణ రైతుల పోరాట పటిమను వెయ్యి కలాలు, లక్ష గళాలు ఎలుగెత్తి కీర్తించాయని అన్నారు. సాయుధ పోరాటాన్ని అణిచివేసిన సైన్యాధికారులు సైతం రైతాంగ యోధుల శౌర్యాన్ని త్యాగనిరతిని తమ రహస్య నివేదికల్లో కొనియాడితే.. ఆ పత్రాలను ఇటీవల వెలికితీసి అమెరికాలోని ఫెయిర్ ఫీల్డ్ యూనివర్సిటీ ×ఫ్రం రాజ్ టు రిపబ్లిక్×పేరుతో పుస్తకం ముద్రించిందన్నారు. ఈ కార్యక్రమంలో జగద్గిరిగుట్ట కురుమ సంఘం అధ్యక్షుడు కొడే నర్సింలు, సెక్రటరీ దేవరి మల్లేష్, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జీడిమెట్ల ఫిషర్‌మెన్ కో-ఆపరేటివ్ సొసైటీకి అవార్డు


చిలుకూరి కృష్ణకు అవార్డు అందజేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల ఫిషర్‌మెన్ కో-ఆపరేటివ్ సొసైటీకి ఎన్‌సీడీసీ ప్రాంతీయ కో-ఆపరేటివ్ ఎక్సలెన్సీ మెరిట్ అవార్డు లభించింది. గురువారం నేషనల్ కో-ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా సొసైటీ అధ్యక్షుడు చిలుకూరి కృష్ణ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఎఫ్‌సీఎస్ చైర్మన్ మన్నె రాజు, డీఎఫ్‌ఓ పూర్ణిమ, కార్యదర్శి మద్దూరు వీరేష్, కార్యవర్గ సభ్యులు డి.శ్రవణ్‌కుమార్, తాళ్ల వెంకటేష్, అర్కల లక్ష్మణ్, మన్నె శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులను జాగ్రత్తగా చూసుకుంటే.. వారు కంపెనీని జాగ్రత్తగా చూసుకుంటారు

టైటాన్ వాచెస్ అండ్ వేరబుల్ డివైసెస్ సీఈఓ సుపర్ణమిత్ర


టీహబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సీఈఓ సుపర్ణమిత్ర, ప్రియాగజ్జర్

రాయదుర్గం: మీరు ఉద్యోగులను జాగ్రత్తగా చూసుకుంటే వారు వ్యాపారం, కంపెనీని బాగా చూస్తారని టైటాన్ వాచెస్ అండ్ వేరబుల్ డివైసెస్ సీఈఓ సుపర్ణమిత్ర అన్నారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్‌లో ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్(ఎఫ్ఎల్ఓ) హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో 'టాటా లెగసీ-లివింగ్ వాల్యూస్' అనే అంశంపై గురువారం సమావేశం జరిగింది. ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ హైదరాబాద్ చాప్టర్ చైర్‌పర్సన్ ప్రియాగజ్జర్‌తో ఆమె ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుపర్ణమిత్ర పలు ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. వ్యక్తిగతంగా కంటే మహిళలు కలిసి, సామూహికంగా జట్టుగా ఉంటే అందంగా, బలంగా ఉంటారన్నారు, చేతి గడియారాలు ఎప్పటికీ చెలామణిలో నుంచి పోవని స్పష్టం చేశారు. ప్రస్తుత మొబైల్ ఫోన్ల యుగంలోనూ చేతి గడియారాలు పాతబడిపోలేదన్నారు. ప్రియాగజ్జర్ మాట్లాడుతూ వ్యక్తుల కేంద్రీకృత విలువలు, మానవీయ దృక్పథం దాని జీవనాధారమని చెప్పారు.

మెడికల్ ఆఫీసర్‌పై ఎస్ఎఫ్ఏల ఫిర్యాదు



కూకట్‌పల్లి: ఏడాదిగా మూసాపేట సర్కిల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాల్మన్‌రాజ్ అరాచకాలు తట్టుకోలేకపోతున్నామని ఎస్ఎఫ్ఏలు గురువారం డీసీకి ఫిర్యాదు చేశారు. శానిటేషన్ విభాగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని పరిష్కరించాలన్నారు. వారికి ఇవ్వాల్సిన సామగ్రి సకాలంలో అందడం లేదని ఇచ్చే సామగ్రి కూడా అరకొరగా ఇస్తున్నారని వాపోయారు. ఈ విషయం మెడికల్ ఆఫీసర్ దృష్టికి తీసుకెళ్తే దుర్భాషలాడి దాడికి యత్నించారని తెలిపారు. ఆయన తీరు ఖండిస్తూ ఎస్ఎఫ్ఏలు విధులు బహిష్కరించారు. అనంతరం కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున నిరసనకు దిగారు.